సాక్షి ఖమ్మం

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అరచేతిలో విద్యుత్ సేవలు!

విద్యుత్ సమాచారం, ఫిర్యాదులే కాక బిల్లులు చెల్లించేందుకు అందుబాటులో ఉన్న యాప్‌ను మరింతగా మెరుగుపరిచారు. 8లో



ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు

ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగిని సస్పెండ్ చేసిన అదనపు కలెక్టర్, ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వేగంగా లోక్ అదాలత్ పరిష్కార ప్రక్రియ



వీసీలో సూచనలు చేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ జరగనుండగా, ఇప్పటి నుంచే కేసుల పరిష్కార ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆదేశించారు. సత్తుపల్లి, మధిర న్యాయమూర్తులతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గణేష్ నిమజ్జనోత్సవం ముగిసినందున పోలీసు అధికారుల సహకారంతో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులను పరిష్కరించాలని తెలిపారు. క్రిమినల్ కేసులే కాక సివిల్, కుటుంబ తగాదా కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రధానంగా భార్యాభర్తలకు సంబంధించి ఒక కేసు పరిష్కరిస్తే అనుబంధంగా ఇతర కేసులు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: 2024–25వ విద్యాసంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నవంబర్ 24వ తేదీన జరిగే పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం http//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్‌కు కొత్త పత్తి !

● క్వింటాకు గరిష్ట ధర రూ.7,722



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న అధికారులు, వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం కొత్త పత్తి విక్రయానికి వచ్చింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు 20 మంది 126 బస్తాల పత్తిని తీసుకొచ్చారు. క్వింటాకు గరిష్టంగా రూ.7,722, మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.5వేలుగా నమోదైంది. అలాగే, పాత పత్తి 1,138 బస్తాలు రాగా గరిష్టంగా రూ.8వేలు, కనిష్ట ధర రూ.5వేలు పలికింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521గా ప్రకటించగా ఖమ్మం మార్కెట్‌లో అంతకు మించి నమోదైంది. మే చివరి వారం, జూన్ మొదటి వారంలో వేసిన పత్తి పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తుండడంతో కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈసందర్భంగా కొత్త పత్తికి పూజలు చేసి కొనుగోళ్లు ప్రారంభించారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ కుటుంబాల నుంచే మళ్లీ దరఖాస్తులు

ఖమ్మం మయూరిసెంటర్: ప్రభుత్వం నుండి వరద సాయం అందలేదని కేఎంసీ కార్యాలయానికి బుధవారం అందిన దరఖాస్తుల్లో 90 శాతం పరిహారం అందిన కుటుంబాల నుంచే వచ్చాయని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కుటుంబానికి పరిహారం అందగా, అదే కుటుంబం నుంచి మరో వ్యక్తి వచ్చి దరఖాస్తు ఇస్తున్నారని పేర్కొన్నారు. కేఎంసీకి బుధవారం పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందడంతో ఉద్యోగులతో సమీక్షించగా ఈ విషయం తేలిందని చెప్పారు. ప్రతీ కుటుంబానికి సాయం అందుతుందని, అలా జమ అయిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు. ఇక బ్యాంక్ వివరాలు తప్పుగా నమోదైతే సరిచేస్తున్నామని, వారి బ్యాంకు ఖాతాల్లో త్వరలోనే నగదు జమ అవుతుందని కమిషనర్ తెలిపారు.

గ్యాస్ దందా...

ముదిగొండ మండలంలోని బాణాపురానికి చెందిన ఓ కుటుంబం ఏటా మూడు నుంచి నాలుగు సిలిండర్ల వరకు వాడేవారు. ఇటీవల వారు గ్యాస్ బుక్ చేయకున్నా రిజిస్టర్డ్ ఫోన్ నంబర్‌కు మెసేజ్ వచ్చింది. కొద్దిసేపటికే ఓటీపీ రావడంతోపాటు గ్యాస్ ధరతో మరో మెసేజ్ అందింది. ఆ వెంటనే సిలిండర్ డెలివరీ అయినట్లు మరో మెసేజ్ వచ్చింది. ఇదేమిటని గ్యాస్ ఏజెన్సీలో ఆరా తీయగా కనుక్కుంటామని సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశారు. ఇలా ఈ కుటుంబానికి ఏడాదిలో రెండు సార్లు జరగడంతో అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వీరొక్కరికే కాక జిల్లాలో పలువురికి ఇలా జరుగుతోందని.. గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, సిబ్బంది మాయాజాలమే ఇందుకు కారణమని తెలుస్తోంది.



పక్కదారి పడుతున్న సబ్సిడీ సిలిండర్లు

- వినియోగదారుల పేరిట బుక్ చేసి ఇతరులకు విక్రయం
- అక్రమార్జనే లక్ష్యంగా డీలర్ల ఎత్తులు
- మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు
- వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ అమ్మకం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. డీలర్లు వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్ చేసి ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని దాటవేస్తున్నారు. వినియోగదారులకు సబ్సిడీ జమ అవుతున్నా.. సిలిండర్లను డీలర్లు ఇతరులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గృహావసరాల సిలిండర్లను హోటళ్లు, వాణిజ్య సంస్థలకు చేరవేస్తున్నారు. మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతుండగా పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వినియోగదారులకే ఆంక్షలు

వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ కావాలంటే మొదట బుక్ చేసుకోవాలి. ఆతర్వాత డెలివరీ సమయాన ఓటీపీ చెప్పాలి. ఇదంతా సామాన్య వినియోగదారులకే వర్తిస్తుండగా.. కొందరు డీలర్లు ఇతరులకు మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా అమ్మేస్తున్నారని తెలుస్తోంది. ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లు మాత్రమే బుక్ చేసుకునే వారిని లక్ష్యంగా చేసుకుని వారి పేరిట బుక్ చేసి ఇతరులకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఈ సమయాన వినియోగదారుడి సెల్ నంబర్‌కు బుక్ చేసినట్లు, డెలివరీ అయినట్లు మెసేజ్‌లతో పాటు ఓటీపీ కూడా వస్తోంది. కానీ ఓటీపీ కోసం ఎవరూ ఫోన్ చేయడం లేదు. దీంతో డీలర్లు తాము అమ్ముకోదలచుకుంటే ఓటీపీతో పనిలేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యం

వాణిజ్య అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగించడానికి వీల్లేదు. కానీ ఆ సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు డీలర్లు హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. తోపుడుబండ్లపై నిర్వహించే టిఫిన్ సెంటర్లు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ వస్తుండడం.. కొందరు ఏటా రెండు నుంచి మూడు మాత్రమే వాడుతుండటంతో వారి పేరిట సిలిండర్లు బుక్ చేసి వాణిజ్య అసరాలకు మళ్లించి డీలర్లు సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

“ ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం..

వినియోగదారులకు సంబంధం లేకుండా గ్యాస్ బుక్ చేసినట్లు, డెలివరీ ఇచ్చినట్లు మెస్సేజ్‌లపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. ఇలా చేసే ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. అలాగే, డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయాలి. – చందన్‌కుమార్, డీఎస్‌ఓ

గ్యాస్ ఏజెన్సీలు	33
మహాలక్ష్మి లబ్ధిదారులు	2,27,193 మంది
సింగిల్ సిలిండర్లు	2,51,112
డబుల్ సిలిండర్లు	1,19,087
దీపం పథకం	63,900
సీఎస్ఆర్ పథకం	23,501
ఉజ్వల	70,624
మొత్తం కనెక్షన్లు	5,28,224

● డెలివరీ బాయ్స్ దందా..

డీలర్ల వ్యవహారం ఇలా ఉంటే.. సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది తమ వంతుగా వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. ఐదు కిలోమీటర్ల వరకు సిలిండర్‌ను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కి.మీ. అయితే రూ.10, అంతకు మించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవచ్చు. కానీ ఎక్కడైనా సరే సిలిండర్ తీసుకొస్తే చాలు రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి నెల ఆలస్యం చేయడమో లేదంటే డోర్ లాక్ చేసి అని దాటవేయడమో చేస్తున్నారని తెలుస్తోంది.

పట్టని పౌరసరఫరాల శాఖ..

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. డీలర్లు లెక్కాపత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నా తనిఖీల మాటెత్తడం లేదు. గ్యాస్ గోదాంల్లో కానీ ఏజెన్సీల్లో కానీ తనిఖీ చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఇదే అదునుగా డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డూ అదుపు లేకుండా దందా కొనసాగిస్తున్నారు.

వరదలను ఎదుర్కొనేలా ప్రణాళిక

- 1077తో శాశ్వత టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- విపత్తు సమయాన ప్రజలను అప్రమత్తం చేసేలా సైరన్
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంరూరల్: భవిష్యత్‌లో ఎప్పుడు వరదలు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా యంత్రాంగం పకడ్బందీగా సిద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో మున్నేరు వరద ప్రభావిత ప్రాంతమైన కరుణగిరిలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా సెయింట్ జోసెఫ్ మేజర్ చర్చి హాల్‌లో యాజమాన్యం, అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల వచ్చిన వరదతో జరిగిన నష్టం, కరుణామయ అనాథాశ్రమం, అంధులు, బధిరులకు సంబంధించి జ్యోతి నివాస్ స్కూల్ ప్రాంతాన ఎంత మేరకు వరద వచ్చింది, ప్రాణ సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చర్చించి భవిష్యత్ సంసిద్ధతపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంటల వ్యవధిలో కుంభవృష్టి వర్షం పడడం, పరీవాహక ప్రాంతాల చెరువులు, ప్రాజెక్టుల నుంచి వరద చేరడంతో మున్నేరు గతంలో ఎన్నడూ లేనంతగా ఉప్పొంగిందని తెలిపారు. వరద సహాయక చర్యలను వీలైనంత మేర సమర్థవంతంగా నిర్వహించామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున పాటించాల్సిన జాగ్రత్తలపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ రూపొందిస్తున్నామని తెలిపారు. కరుణగిరి ప్రాంతాల్లో వరదల సమయాన ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే, వరద వస్తే సమీపంలోని ఎత్తయిన భవనాలకు చేరుకునేలా ముందస్తు ప్రణాళిక తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

శాశ్వతంగా టోల్‌ఫ్రీ నంబర్

జిల్లా వ్యాప్తంగా వరదలు వంటి విపత్కర సమయాన ప్రజలు సమాచారం ఇచ్చేందుకు శాశ్వతంగా 1077 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతేకాక ఆసక్తి ఉన్న వారికి వలంటీర్లుగా శిక్షణ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా, వరదలతో విద్యార్హత సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి త్వరలో జారీ చేయిస్తామని, ముంపు బాధితులకు స్వశక్తి, స్వయం సహాయక సంఘాలు, ముద్ర, ప్రధానమంత్రి ఉపాధికల్పన ద్వారా రుణాలు ఇప్పిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వివరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్‌శ్రేష్ఠ, తహసీల్దార్ బి.రాంప్రసాద్, చర్చి రెక్టార్ జయరాజు, సుధాకర్, ప్రతినిధులు సురేష్, కార్యదర్శి విజయ్, ఛార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

పెసల కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పెసల కొనుగోళ్లను బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. ఈనెల 16న ‘హామీ నీటి మూటే!’ శీర్షికన ‘సాక్షి’లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఖమ్మం మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెసల పంట దెబ్బతినగా తడిసిన పెసలను సైతం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అయినా మార్క్‌ఫెడ్ అధికారులు నిబంధనల పేరిట నిరాకరిస్తుండడంతో రైతులు చేసేదేం లేక తక్కువ ధరతో వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. పెసలకు కేంద్ర ప్రభుత్వం రూ.8,682 మద్దతు ధర ప్రకటిస్తే వ్యాపారులు రూ.6వేల నుంచి రూ.7వేలకు మించి చెల్లించడం లేదు. ఈ వివరాలతో ‘సాక్షి’లో కథనం ప్రచురితం కాగా స్పందించిన అదనపు కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఆదేశించారు. అలాగే, రైతులు పెసలను ఆరబెట్టి తీసుకురావాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పెసల తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, తదితరులు

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

- పార్టీ ప్రతినిధులతో భేటీలో అదనపు కలెక్టర్ శ్రీజ
- ఈనెల 28న తుది జాబితా ప్రచురణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవన్‌టౌన్: గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశామని తెలిపారు. ఇందులో అభ్యంతరాలు, నూతన ఓటర్ల దరఖాస్తులను 21వ తేదీలోపు ఎంపీడీఓలకు లిఖిత పూర్వకంగా సమర్పించాలని చెప్పారు. ఆపై 26లోగా అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ మేరకు అర్హులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఒక కుటుంబంలో సభ్యులందరికీ ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, వివిధ పార్టీల నాయకులు అన్నం గోపాల్‌రావు, సంగబత్తుల నవీన్‌రెడ్డి, ఎస్.వీరబాబు, ఆవుల అశోక్, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అంగన్‌వాడీల పర్యవేక్షణ

అంగన్వాడీ కేంద్రాల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందేలా తనిఖీలు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుని పోషకాహార లోపం కలిగిన పిల్లలను సాధారణ స్థితికి తీసుకొచ్చేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ప్రతీ సూపర్‌వైజర్ ఒక్కోనెల ఇరవై కేంద్రాలను తనిఖీ చేసి టీచర్‌కు సూచనలు ఇవ్వాలని చెప్పారు. ప్రతీనెల మొదటి, చివరి వారంలో నిర్వహించేలా సమావేశాలకు పోషకాహారలోపం కలిగిన పిల్లల వివరాలతో సూపర్‌వైజర్లు, సీడీపీఓ హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వంద శాతం హాజరుకావాలి

ఇంటింటికీ వెళ్లి ఆరా తీసిన డీఈఓ



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

నేలకొండపల్లి: విద్యార్థులు వంద శాతం పాఠశాలలకు హాజరయ్యే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని పైనంపల్లి, చెరువుమాధారం, రాజారాంపేట ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులలు, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు గైర్హాజరుపై చర్చించారు. ఈమేరకు పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు నేరుగా వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. కొందరు విద్యార్థుల ఇళ్ల వద్ద ఉండగా, ఇంకొందరు వినాయక మండపాల వద్ద ఉండడంతో పాఠశాలకు తీసుకొచ్చారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తరచుగా గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి కారణాలు ఆరా తీయాలని సూచించారు. అలాగే, మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని తెలిపారు. మండల నోడల్ అధికారి చలపతిరావు, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిత్యం అప్రమతంగా ఉండాలని.. తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడొచ్చని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని బుధవారం ఆమె రఘునాథపాలెంలో ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు, అంతర్గత రహదారులను పరిశీలించాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ నాయుడు, ఏపీఎం శారద, గ్రామపంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నం వేళ నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా ఆదేశించారు. మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో బుధవారం తనిఖీ చేసిన ఆమె మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు, నాణ్యతపై తెలుసుకున్నారు. అలాగే, చింతకాని ఉన్నత పాఠశాలలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ రామయ్య, హెచ్‌ఎంల శ్రీనివాసరావు, బీవీ.శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణం.. ప్రమాదం

ఇటీవల వరదలతో ఖమ్మంలో మున్నేటిపై ప్రకాష్‌నగర్ వద్ద ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేశారు. అటూఇటు అడ్డుగోడలు కట్టడంతో పాటు కందకాలు తవ్వించారు. అయినప్పటికీ చుట్టూ తిరిగి వస్తే దూరాభారం అవుతుందని భావిస్తున్న కొందరు వాహనదారులు మొండిగా వ్యవహరిస్తూ ప్రయాణం చేస్తున్నారు. అడ్డుగోడ కొంత మేరకు కూల్చివేయగా.. కందకాల పక్క నుంచి వాహనాలను తీసుకెళ్తున్నారు. బ్రిడ్జి పక్కనే గోడపై నుంచి బైక్‌లతో ప్రకాష్‌నగర్ నుంచి వెంకటగిరి వైపు రెండు వైపులా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కాస్త అటూఇటు అయినా పైనుంచి పడే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురానికి చెందిన ఓ వాహనదారుడు కింద పడడంతో భుజానికి తీవ్ర గాయమైంది. ఇకనైనా ఈ ప్రాంతంలో మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / ఖమ్మం క్రైం



కందకం పక్కన గోడ పైనుంచి వెళ్తున్న వాహనదారులు



ప్రమాదకర పరిస్థితిలో వాహనాన్ని దాటిస్తూ..





ఎత్తయిన గోడపై వెళ్తున్న వాహనదారులు



గోడపై నుంచి కిందపడిన వ్యక్తి

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు


చెక్కులు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు కుటుంబానికి మంజూరైన రూ.7,99,895 భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం అందించారు. అలాగే, సత్తుపల్లికి చెందిన కానిస్టేబుల్ బాబు కుటుంబానికి రూ.7,54,301 చెక్కు అందజేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ కుటుంబాలను అండగా నిలుస్తామని, శాఖాపరంగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌లోకి హ్యూండాయ్ 'అల్కజార్'


కారును విడుదల చేస్తున్న సుభాష్‌చంద్రబోస్

ఖమ్మంఅర్బన్: హ్యూండాయ్ కంపెనీ నూతనంగా రూపొందించిన అల్కజార్ కారును ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈసందర్భంగా భారత్ గ్రూప్ కంపెనీ చైర్మన్ కేసా సుభాష్‌చంద్రబోస్ ఈ కారును షోరూంలో విడుదల చేసి మాట్లాడారు. ఎస్‌యూవీ మోడల్‌లో తీసుకొచ్చిన ఈ కారులో అధునాతన సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూని యన్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల అధికా రులు లింగస్వామి, హన్మంతరెడ్డి, మనోహర్, యూట్యూబర్ రంగాబాబు, హ్యూండాయ్ టీఎస్‌ఎం అన్వర్, భారత్ హ్యూండాయ్ సీఈఓ శయన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలతో గ్రూపు సభ్యురాలు మాయం?

నేలకొండపల్లి: స్వయం సహాయక సంఘం సభ్యురాలు బ్యాంకులో పొదుపు నగదు చెల్లించకుండా వెళ్లిపోయిన ఘటన ఇది. నేలకొండపల్లికి చెందిన శ్రీరామ స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రతీనెలా రూ.50వేల వరకు బ్యాంకులో పొదుపు, అప్పు కింద చెల్లిస్తున్నారు. అయితే, సభ్యులు అందించిన నగదు రూ.50వేలను ఓ సభ్యురాలు బ్యాంకు చెల్లించలేదు. ఈ నెల బ్యాంకుకు వెళ్లిన సభ్యులకు ఈ విషయం తెలియడంతో సభ్యురాలి ఇంటికి వెళ్లగా కుటుంబీకులతో సహా ఎవరూ కానరాలేదు. అంతేకాకుండా ఫోన్లు స్విచాఫ్ వస్తుండడంతో తమకు న్యాయం చేయాలని సంఘం లీడర్లు కె.సుశీల, జి.భవాని బుధవారం పోలీసులను ఆశ్రయించారు.

ప్రమాదవశాత్తులో బావిలో పడి ఎద్దులు మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడి జత ఎద్దులు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని శంకరగిరితండా పంచాయతీ పరిధి కట్టుకొమ్ముతండాకు చెందిన జర్పుల రెడ్యా ఐదెకరాల కౌలుకు తీసుకుని సాగు చేస్తూ ఇటీవల రూ.1.50 లక్షలు వెచ్చించి జత ఎద్దులు కొనుగోలు చేశాడు. బుధవారం పొలంలో అరక దుక్కి దున్ని ఇంటికి వస్తుండగా నీరు తాగేందుకు ఎద్దులు చెరువు వైపు వెళ్లాయి. అయితే, మార్గమధ్యలో ఉన్న బావిలో పడడంతో మృతి చెందాయి. గ్రామస్తుల సహకారంతో ఎద్దులను బయటకు తీసిన రెడ్యా, కుటుంబీకులు బోరున విలపించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్


మంటలు వ్యాపించిన దృశ్యం

వైరా: వైరాలోని శారద నర్సింగ్ హోమ్ మొదటి అంతస్తులో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. మోటార్ స్విచ్ కాలిపోగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పినట్లయింది.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

భద్రాచలం అర్బన్: భద్రాచలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భద్రాచలం పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులు బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందినవారుగా విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని సైతం పట్టుకుంటామని వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

అరచేతిలో విద్యుత్ సేవలు!


యాప్‌లోని ఆప్షన్లు

19 ఆప్షన్లతో ఎన్పీడీసీఎల్ ప్రత్యేక యాప్
- రీడింగ్ నమోదు మొదలు బిల్లులు చెల్లింపు వరకు సులువు
- పేర్లు, లోడ్ మార్పులు, చేర్పులే కాక ఫిర్యాదులు సైతం ఆన్‌లైన్‌లో..

ఖమ్మంవ్యవసాయం: మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది రావడం ఒకరోజు ఆలస్యమైతే స్లాబ్ మారి బిల్లు పెరుగుతుందనే ఆందోళన మొదలవుతుంది. ఇక బిల్లు వచ్చాక చెల్లించడానికి కార్యాలయానికి వెళ్లిరావడం మరో ప్రయాస! ఇవికాక విద్యుత్ సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయాలన్నా, లోడ్ పెంపునకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఎవరిని సంప్రదించాలి.. ఎక్కడకు వెళ్లాలో తెలియని సందిగ్ధ స్థితి. వీటన్నింటికీ చెక్ పెట్టేలా ఇప్పటికే ఉన్న మొబైల్ యాప్‌ను మరింతగా తీర్చిదిద్దింది టీజీ ఎన్పీడీసీఎల్! వినియోగదారులకు అవసరమైన అన్ని అంశాలతో కూడిన 19 ఆప్షన్లతో యాప్‌ను అందుబాటులోకి తీసుకురాగా, వివరాలను ఖమ్మం సర్కిల్ ఆపరేషన్స్ ఎస్‌ఈ ఏ.సురేందర్ వెల్లడించారు. కాగా, tgnpdcl పేరిట ఉండే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అంశాల వారీగా వివరాలు...

▶ **రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ :** ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగితే జీపీఎస్ లొకేషన్ ద్వారా వినియోగదారుడి ఫోన్ నుండి ఫొటో తీసి పంపొచ్చు. తద్వారా నేరుగా సంబంధిత అధికారికి వివరాలు వెళ్తాయి. ఆపై సమస్యను పరిష్కరిస్తారు.


▶ **కన్జూమర్ గ్రీవెన్స్ :** వినియోగదారులకు సంబంధించిన సమస్యలను 'న్యూ కంప్లైంట్' ఆప్షన్ వద్ద పొందుపర్చవచ్చు. మీటర్ నంబర్, సమస్య తాలూకు వివరాలు నమోదు చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతీ అంశంపై ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇదే కేటగిరీలోని కంప్లైంట్ స్టేటస్ ద్వారా ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. అంతేకాక పరిష్కరించినా సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ కంప్లైంట్ ఆప్షన్ ద్వారా మళ్లీ ఫిర్యాదు చేయొచ్చు.

▶ **సెల్ఫ్ రీడింగ్ :** ఈ ఆప్షన్ ద్వారా వినియోగదారులు మీటర్ రీడింగ్ సొంతంగా నమోదు చేయవచ్చు. నిర్ణీత వ్యవధిలో రీడింగ్ నమోదు చేసి బిల్లు చూసుకోవచ్చు.

▶ **పే బిల్స్ :** నెలవారీ విద్యుత్ బిల్లులను సర్వీస్ నంబర్ ఆధారంగా చెల్లించవచ్చు. ఇది చాలా సులభంగా వేగంగా పూర్తవుతుంది. కేవలం రెండు నిమిషాల్లో చెల్లించవచ్చు. అందరి చేతుల్లో ఇంటర్నెట్‌తో కూడిన ఫోన్లు ఉన్నందున ఈ విధానం ఉపయోగపడుతుంది.

▶ **బిల్ హిస్టరీ :** వినియోగదారులు చెల్లించిన నెలవారీ బిల్లులను ఎప్పుడైనా చూసుకోవచ్చు. తద్వారా బిల్లులు పెరగకుండా ఆదా చేసే అవకాశం ఏర్పడుతుంది.

▶ **ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ :** ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.



ఎన్పీడీసీఎల్ యాప్

▶ **ఇలా సంప్రదించాలి :** సమాచారం, ఫిర్యాదుల కోసం ఎవరిని సంప్రదించాలనే వివరాలే కాక టోల్ ఫ్రీ నంబర్లు 18004250028, 1912ను కూడా పొందుపరిచారు.

▶ **లింక్ ఆధార్ – మొబైల్ :** వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్ చేసుకోవడం వలన విద్యుత్ బిల్లులకు సంబంధించి ప్రతీ ఫోన్‌కు మెసేజ్ రూపంలో వస్తుంది. తద్వారా బిల్లు చెల్లించాల్సి గడువు తెలిసిపోతుంది.

▶ **డొమెస్టిక్ బిల్ క్యాలుక్యులేటర్ :** వినియోగదారుల నెలవారీ మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే ఇతర వివరాలు తెలుస్తాయి. వాడిన యూనిట్లు, ఒక్కో యూనిట్ చార్జీ ఇతర చార్జీలు తెలుసుకోవచ్చు.

▶ **కొత్త కనెక్షన్ :** కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో పొందుపరిచారు. ఈమేరకు కావాల్సిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

▶ **పేరు, లోడ్ మార్పు :** విద్యుత్ మీటర్ ఎవరి పేరిట ఉన్నా తగిన ఆధారాలతో మార్చుకోవడం, లోడ్ పెంపునకు ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది.

▶ **పవర్ కన్జమ్షన్ గైడ్‌లైన్స్ :** విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

▶ **టారిఫ్ డీటైల్స్ :** వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో సవివరంగా ఉన్నాయి. గృహ వినియోగదారులు, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు తదితర వివరాల చార్జీలను కేటగిరీల వారీగా పొందుపరిచారు.

▶ **ఎనర్జీ సేవింగ్ టిప్స్ :** విద్యుత్ ఉపకరణాలు వినియోగిస్తున్నప్పుడు ఎలా చేస్తే పొదుపు చేయొచ్చో సూచనలు చేశారు. అంతేకాక నాణ్యమైన ఉపకరణాల వినియోగంపై సూచనలు ఉన్నాయి.

▶ **సేఫ్టీ టిప్స్ :** విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇందులో పొందుపర్చారు. విద్యుత్‌ను ప్రమాదకారిని గుర్తించడం, స్వీయ నియంత్రణ పాటించడం, సొంతంగా రిపేర్ చేయవద్దనే సూచనలు చేశారు.

▶ **ఫీడ్ బ్యాక్ :** వినియోగదారులు తమకు అందుతున్న సేవలపై అభిప్రాయాలను పంచుకోవచ్చు. ఆపై మార్పులు, చేర్పులు చేసుకొని మెరుగైన సేవలు పొందొచ్చు.

▶ **మై అకౌంట్ :** ఈ ఆప్షన్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. పేరు, చిరునామా, ఏరియా, మీటర్ తాలూకా వివరాలు పరిశీలించుకోచ్చు.

▶ **బిల్లు సమాచారం :** నో యువర్ బిల్లు పేరిట ఉండే ఆప్షన్‌లో వినియోగదారుల బిల్లుకు సంబంధించి సమాచారం తెలుసుకోవచ్చు.

▶ **అకౌంట్ వివరాలు :** వినియోగదారుల పేరు, చిరునామా, విద్యుత్ ఏరియా, మీటర్ నంబర్ తదితర వివరాలతో ఇంకో ఆప్షన్ ఉంటుంది

'బీజేపీ నేతల తీరు అప్రజాస్వామికం'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న వ్యాఖ్యలు అప్రజాస్వామికమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం బీజేపీ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశాక ఆయన మాట్లాడారు. కొద్దిరోజులుగా బీజేపీ, శివసేన నాయకులు చేస్తున్న ప్రకటనలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీని బహిరంగంగా చంపుతామని బహిరంగంగా ప్రకటనలు చేసినా ప్రధాని మోడీ, అమిత్ షా స్పందించకపోవడం గర్హనీయమన్నారు. ఇకనైనా వ్యాఖ్యలు చేసిన నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్పొరేటర్లు పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ గౌస్, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన భారతీచంద్రం, గంగరాజు యాదవ్, బాణాల లక్ష్మణ్, అబ్బాస్ బేగ్, ప్రతిభారెడ్డి, మందపల్లి నాగమణి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం ఓ పాడిగేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు గుడిద నాగేశ్వరావు తన గేదెను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ రక్షణ ఏర్పాట్లు లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో గేదె షాక్‌కు గురై మృతి చెందింది. రూ.90వేల విలువైన గేదెను కోల్పోయిన తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఉద్యోగి సస్పెన్షన్, ఎంపీడీఓకు నోటీస్

ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీ తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ: ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన సమయాన సమాచారం లేకుండా సీనియర్ అసిస్టెంట్ ఆర్.బాలాజీ తుల్జాసింగ్ విధులకు గైర్హాజరైనట్లు తేలడంతో సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాక ఎంపీడీఓ శ్రీధర్‌స్వామికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, ఎంపీఓ వాల్మీకి కిషోర్‌తో మాట్లాడి ముసాయిదా ఓటరు జాబితా వెల్లడి, అభ్యంతరాల స్వీకరణపై సూచనలు చేశారు. ఆతర్వాత ముదిగొండలోని పీహెచ్‌సీకి వెళ్లిన అదనపు కలెక్టర్ అక్కడకు వచ్చిన వారితోనే కాక వైద్యాధికారి అరుణాదేవితో వైద్యసేవలపై ఆరా తీశారు. ఆతర్వాత ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం, ముత్తారం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆమె వసతులపై ఉపాధ్యాయుడు రాములుతో చర్చించారు.

వేధింపులు తాళలేక బాలిక బలవన్మరణం

మహిళ దుష్ప్రచారమే కారణమని కుటుంబీకుల ఆందోళన

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడు పంచాయతీ పరిధి గుండాలతండాకు చెందిన బాలికను మరో మహిళ వేధించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు... తండాకు చెందిన 17ఏళ్ల బాలిక ఖమ్మంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఆమె తండ్రి అదే గ్రామానికి చెందిన అజ్మీరా గోపి ఫోన్ నుంచి అప్పుడప్పుడు బాలికతో మాట్లాడేవాడు. ఈవిషయాన్ని గమనించిన గోపి భార్య రేణుక సదరు బాలికను మందలించింది. అంతటితో ఆగక తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందని ప్రచారం చేస్తూ తరచూగా దూషిస్తోంది. రేణుకకు ఆమె భర్త గోపి, మామ బాసు వత్తాసు పలకడంతో బాలిక ఈనెల16న కలుపు మందు తాగగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఆమె బుధవారం మృతి చెందడంతో మృతదేహాన్ని గోపి ఇంటి ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజ్ చేరుకుని నిందితులను చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు గోపి, రేణుక, బాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడు...

ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం శివారు సాయిఆదిత్య టౌన్‌షిప్‌కు చెందిన వి.వెంకటరాజు (61) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అనారోగ్య కారణాలతో అన్‌ఫిట్ కాగా చిన్నకుమారుడికి ఉద్యోగం వచ్చింది. అయితే, వెంకటరాజు కొంతకాలంగా మద్యానికి బానిస కాగా కుటుంబీకులు చెప్పినా వినడం లేదు. ఇంతలోనే ఈనెల9న చిన్నకుమారుడు ఉంటున్న గోదావరిఖనికి వెళ్లి ఈనెల 17న ఆదిత్యనగర్‌కు వచ్చిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

లారీ యజమాని ఆత్మహత్య

- బొగ్గు లోడింగ్ లేకపోవడమే కారణమని ఆందోళన


సత్తుపల్లిలో ఆందోళన నిర్వహిస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లి: సింగరేణి బొగ్గు లోడింగ్ లేక లారీ ఫైనాన్స్ కట్టలేని పరిస్థితుల్లో ఓ లారీ యజమాని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రేజర్లకు చెందిన బోళ్ల కృష్ణ(55)కు ఐదు లారీలు ఉన్నాయి. అయితే, సింగరేణి నుంచి సరిపడా బొగ్గు లోడింగ్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురై ఫైనాన్స్ కిస్తీలు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యాన ఆయన సోమవారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు సత్తుపల్లిలో చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. కృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, కృష్ణ మృతి విషయం తెలియడంతో లారీ యజమానుల సంఘం ఆధ్వర్యాన బుధవారం బస్టాండ్ రింగ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రావి నాగేశ్వరరావు, పీఎల్.ప్రసాద్ మాట్లాడుతూ సత్తుపల్లిలో జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలను నమ్ముకుని 700 లారీలు కొనుగోలు చేసి కిరాయిలకు తిప్పుతుండగా, సకాలంలో లోడింగ్ ఇవ్వక యజమానులు అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని వాపోయారు. సత్తుపల్లి నుంచి ఆర్‌సీబీకి బొగ్గు తరలిస్తుండడంతో ఈ ప్రాంత లారీ యజ మానులకు కిరాయి దక్కడం లేదని తెలిపారు. ఇంకెంత మంది చనిపోతే అధి కారులు స్పందిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాషా, ఓలేటి సత్యం పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి


సత్యనారాయణ (ఫైల్)

వేంసూరు: పొలానికి వెళ్తున్న రైతును పాముకాటు వేయడంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని దిద్దెపూడిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మోరంపూడి సత్యనారాయణ(64) జామాయిల్ తోటను పరిశీలించేందుకు వెళ్తుండగా కాలిపే పాము కాటు వేసింది. దీంతో ఆయన కేకలు వేస్తుండగా సమీపంలోని రైతులు చేరుకుని పామును చంపి ఆయనను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఆర్‌సీఓ తనిఖీ


అధ్యాపకులతో సమీక్షిస్తున్న ఆర్‌సీఓ నాగార్జున

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను బుధవారం ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ కె.నాగార్జున తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యంపై తీసుకుంటున్న జాగ్రత్తలు తెలుసుకున్నారు. అలాగే, మెనూ అమలు, భోజనం నాణ్యతపై విద్యార్థినులను ఆరాతీశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఏఓ కె.చంద్రయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆలోచన అభినందనీయం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ఉమాశంకరరావు

కొణిజర్ల: వరద బాధితులకు సాయం అందేలా 'నా ఖమ్మం కోసం నేను' పేరిట ఇచ్చిన పిలుపునకు చిన్నారులు స్పందించడం అభినందనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం మున్నేరు వరద బాధితుల సహాయార్థం కొణిజర్లలోని సమత సూపర్ జెమ్స్ పాఠశాల చిన్నారులు రూ 35 వేలు విరాళాలు సేకరించారు. ఈ నగదును కరస్పాండెంట్ కొణతం ఉమాశంకరరావు చేతుల మీదుగా బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు అందించగా ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే ఇతరులకు సాయం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కంచేటి స్రవంతి, నంజాల సాయిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంపెనీ స్థాయి పోటీలు


పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాసరావు, పక్కన అధికారులు, నాయకులు

- మిస్టర్ సింగరేణిగా జేవీఆర్ ఓసీ కార్మికుడు రామకృష్ణ
- స్ట్రాంగ్ ఉమెన్‌గా మాన్వితతో పాటు ఇతర విభాగాల్లో విజేతల ఎంపిక


మిస్టర్ సింగరేణిగా ఎంపికైన రామకృష్ణ


మాన్విత, స్ట్రాంగ్ ఉమెన్ (కొత్తగూడెం ఏరియా)

సింగరేణి(కొత్తగూడెం): స్థానిక సీఈఆర్ క్లబ్‌లో రెండు రోజుల పాటు కొనసాగిన కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీలకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి ఆరు జట్లకు గాను 250 మంది హాజరయ్యారు. ఇందులో 50 మంది మహిళా ఉద్యోగులు కూడా ఉత్సాహంగా పాల్గొని కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పర్సనల్ జీఎం(సెక్యూరిటీ) కోడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ప్రతీ సంవత్సరం సంస్థ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్, ఏరియా, కంపెనీ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామని, ఇక్కడ ప్రతిభ చాటిన వారిని కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. క్రీడాకారుల సంక్షేమమే ధ్యేయంగా సీఎండీ బల రామ్ ప్రత్యేక బడ్జెట్ కేటాయించారని చెప్పారు. అనంతరం విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్)జి.రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నాయకులు పీతాంబరం, సీఎంఓఏఐ ఉపాధ్యక్షులు కేశవరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పాసినెట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పవర్ లిఫ్టింగ్ విభాగంలో స్ట్రాంగ్ ఉమెన్‌గా కొత్తగూడెం ఏరియాకు చెందిన మాన్విత(282 కేజీలు), స్ట్రాంగ్ మెన్‌గా భూపాలపల్లి కేటీకే – 6 ఇంక్లైయిన్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్‌రెడ్డి (612 కేజీలు), బెస్ట్ వెయిట్ లిఫ్టర్‌గా మణుగూరు ఏరియాకు చెందిన కె.అనిల్‌కుమార్(142 కేజీలు), మిస్టర్ సింగరేణిగా కొత్తగూడెం ఏరియా జేవీఆర్ ఓసీ కార్మికుడు ఎంపికయ్యారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి


అధ్యాపకులకు సూచనలు చేస్తున్న డీఐఈఓ

కారేపల్లి: జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పాఠాలు బోధిస్తూనే ఈఏపీసెట్, జేఈఈ, నీట్ తదితర పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని డీఐఈఓ రవిబాబు సూచించారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం సందర్శించిన ఆయన అధ్యాపకులతో సమీక్షించారు. ఇప్పటినుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే కాక పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధిస్తారని తెలిపారు. అంతేకాక కళాశాలలో యూత్ టూరిజం క్లబ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కాగా, ఇటీవల వర్షానికి భవనం స్లాబ్ కురుస్తుండడం, ఇతర మరమ్మతులపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు. లు చేస్తున్న డీఐఈఓ రవిబాబు

చాత్తాద శ్రీ వైష్ణవ కుటుంబాలకు చేయూత


మున్నేటి బాధిత కుటుంబాలతో సమితి బాధ్యులు

ఖమ్మం రూరల్: ఇటీవల మున్నేటికి వచ్చిన వరదతో నష్టపోయిన చాత్తాద శ్రీ వైష్ణవ కుటుంబాలకు శ్రీవేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి ఆధ్వర్యాన అండగా నిలిచారు. ఇప్పటికే బాధిత కుటుంబాలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేయూతతో రేషన్ సామగ్రి అందించారు. ప్రస్తుతం దాతల సహకారంతో సేకరించిన నగదును బుధవారం ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్‌లో 20 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు బోధనం పరాంకుశం, తిరునగరి నరసింహంతో పాటు దాశరథి వెంకటరమణ, తిరునగరి రమణ, తాళ్లూరి పద్మజాదేవి, సింహాచలం నరేందర్, ఎస్.పీ.చైతన్య, రామాయణం శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు